

# గాజు బిరడా

డా. కర్రి సోమశేఖర్

బ్రహ్మజెముడు పొదల వెనక వైపు కంచె నెవరో ఊడతీయటం రెండు సార్లు గమనించాడు సాంబయ్య. పంచె. పైకెగగట్టి పొలం చుట్టూ తిరిగాడు. అక్కడక్కడ పేరుకున్న చెత్త కుప్పలను గట్టువైపుకు నెట్టేశాడు. ఏదో పులిసివ వాసన. నాసికారంధ్రాల్లో దట్టించిన నస్యంముద్ద వల్ల వాసన అంతగా పసిగట్టలేకపోయాడు. పంచె చిక్కంలోకి వేళ్లు పోయి నస్యం డిబ్బీ కోసం తడమసాగాయి.

చిక్కంలో ఉంటేగా, ఇంట్లో మరచాడా డిబ్బీని.

సాంబయ్యది రెండెకరాల మెరక. నీటి సదుపాయం లేక బంజరుగా పడి ఉంది. పొలం మధ్యలో ఉన్న చిన్న బావిలో ఊరే అంతంత మాత్రం నీటితో ఏదో కూరగాయలు పండించేవాడు.

అవి సాంబయ్య ఇంట్లోకే సరి.

బ్రహ్మ జెముడు డొంకల వైపున ఉన్న అరెకరం పల్లం భూమిని ఇటుక పేర్చి-కాల్చేవాళ్లకు రెండేళ్లకు లీజుగా ఇచ్చాడు. ఏడాదికి అయిదువందల ఆదాయం. ఆదాయం తక్కువ వల్ల మూలగా ఉన్న పొదలు, కంపలు తీయించాలనే ఆశక్తి సన్నగిల్లి వాటి మానాన్న వాటిని వదిలేశాడు సాంబయ్య.

ఆరోజు పొలం అంతా ప్రదక్షిణం చేసి చేసి అలసిపోయాడు. దానికి తోడు నిద్రాహారాలు కూడా మరిచిపోయాడు. అచ్చం తాగినవాడిలా తయారయింది మొహం.

"అదేంటి బాబూ అలా ఉన్నారు? మొహం అంతా వాడి అలసినట్టు కనుపిస్తున్నారు?" రామయ్య పలకరింపు.

"నేనలిసినట్లున్నానా? అయితే ఏంటట. వెళ్లు నీపని చూచుకో" చిరాకుపడ్డాడు రామయ్యమీద.

ఆశ్చర్యపోయాడు రామయ్య, సాంబయ్య ప్రవర్తనకు.

"ఏంటి బాబూ ఆ మూలగా బాగా మాగిపోయిన అరటి పళ్ల గుట్టలు. మనవేనా? అంతలా పాడయిపోయేదాకా చూచుకోలేదా?" సానుభూతిగా మరోసారి ప్రశ్నించాడు రామయ్య బెరుకుగానే.

"అరటిపళ్లా? మాగిపోయాయా? ఏవి? ఎక్కడ?"

బ్రహ్మజెముడు పొదలవైపుకు వేలు చూపించాడు రామయ్య.

పైకెగదోశాడు పంచె మువ్వల కర్ర తీసుకున్నాడు. కిర్రు చెప్పులు వేసుకున్నాడు సాంబయ్య. మువ్వల గలగల కిర్రు చెప్పుల కిర్రు కిర్రు శబ్దాలు గాలిలోకెగసాయి. పాతకాలం ఆచారమే అయినా ఆ శబ్దాల వెనుక ఆంతర్యం దారికడ్డంగా ఉండే విష జంతువులు ప్రక్కకు తప్పుకోవటమే.

కాస్తంత దగ్గిరగా వెళ్లి దీర్ఘంగా పరికించి చూశారు ఆ పళ్ల గుట్టల కేసి సాంబయ్య, రామయ్యలు.

"ఎవరు పోశారు చెప్మా ఈ పెంట? ఇందాకటి పులుపు వాసన ఈ మాగిన పళ్లదే కామోసు. అయినా ఈ చుట్టుప్రక్కల ఎవరికీ అరటితోట గూడా లేదు. మరెవరి పనయివుంటుంది? సరే రామయ్య మువ్వు వెళ్లి నీ పని చూసుకో దీని సంగతి నేను చూచుకుంటాను."

రామయ్యను సాగనంపి ఇంకొంచెం ముందుకు పొదల వైపుకు వెళ్లాడు సాంబయ్య. ఏదో చిన్న వస్తువు తళుక్కుమని మెరిసింది.

"ఏంటబ్బా అది?" వంగి చూచాడు.

చిన్న గాజు సీసా. దానికి గాజు బిరడా ముద్దుగా ఉందాసీసా. పైకి తీశాడు. మనసులో ఏదో ఊహించుకుని చిక్కంలో బిగించాడు. ఇంటికి వెళ్లటమే తడవు ఆ బుజ్జి గాజు బిరడా సీసాను

ఆటు ఇటు తిప్పి పరికించి చూచాడు. ఏదో ఆయిలు అనే పేరుంది సీసామీద. ఎప్పుడో విన్నాడు అది తలనొప్పులకు, ఒళ్లు నొప్పులకు మర్దన చేస్తారని. ముక్కుపొడి పోసుకొనేందుకు ముద్దుగా ఉందని మనసులో అనుకుని ఇంట్లో భద్రపరచుకున్నాడు. అంతేకాకుండా ముక్కుపొడి ఎంత ఉంది కనిపిస్తూంటుంది అనుకుని మురిసిపోయాడు.

ఓ వారం గడిచింది.

పొలం వైపుకు వెళ్లాడు సాంబయ్య. ఈసారి కంచె భద్రంగానే ఉంది. ఎక్కడా విప్పినట్లు ఆనవాళ్లు లేవు. పొలం చుట్టూ ఓ ప్రదక్షిణం చేసి బ్రహ్మజెముడు పొదలుండే చోట ఆగి నిశితంగా పరికించాడు. మళ్లీ ఏవేవో పళ్ల గుట్టలు, పుల్లల కట్టలు, ఓ కొత్త కుండ దర్శనమిచ్చాయి. సాంబయ్యకిదేం అర్థం కాలేదు.

“ఎవరయినా పుల్లలేరుకుని కట్టలు కట్టుకుని పెట్టుకున్నారేమో”

మరి కుండ

“అది కూడా వాళ్లదేనేమో”

కొంచెముందుకు సాగాడు. క్రితంసారి దొరికినలాంటి గాజుబిరడా సీసాయే మెరుస్తూ కనపడింది. పైకి తీశాడు. దాంట్లో సగం పైగా ద్రావకం ఉంది. అది ఆయిలే కావచ్చు. ఏవైనా నొప్పులకు రాసుకోవచ్చని గాజు బిరడా బిగించి సీసాను చిక్కంలోకి దోపాడు.

కాకపోతే ఆ పళ్ల గుట్టలు, కట్టెలు, కుండ, ఈ సీసా ఇవన్నీ తన పొలంలోనే పడుండడమేమిటి? బుర్ర దిమ్మెక్కిపోయింది. ఆలోచనలు తెగటం లేదు. సమాధానం దొరకటం లేదు. ముక్కుపొడి డిబ్బీ తెరిచాడు. రెండు వేళ్లతో ఓ పెద్ద పట్టు తీసి నాసికారంధ్రాల్లోకి వేళ్లను పోనిచ్చి గట్టిగా పీల్చాడు. సూరేకారం, గంధకం, బొగ్గు గట్టిగా దట్టించి కాల్చిన తారాజువ్వ ఆకాశానికి శరవేగంతో పోయినంత వేగంగా నషాలానికంటిందా నస్యం పవర్. ఆలోచనలు శరవేగంతో పరుగెత్తాయి. మెదడు హుషారెక్కింది.

ఇంతలోనే

హాచ్... హాచ్.... హాచ్... మూడు తుమ్ములు నేల బ్రద్దలయేలా తుమ్మాడు.

పొదల్లోంచి ఏదో అలికిడయింది. వెనకవైపుగా కంచె తొలగించి ఎవరో వెళ్లిపోతున్నట్లు సవ్వడి.

“ఎవరది?... ఎవర్రా...?” గట్టిగా ప్రశ్నించాడు సాంబయ్య.

ఎవరూ కనపడలేదు. సమాధానం లేదు. క్షణంలో మటుమాయం. చూపుకందలేదు ఎవరూ.

గబగబ ఇంటి ముఖం పట్టాడు సాంబయ్య. కొడుకును పిలుచుకుని పరుగుపరుగున పొలం కేసి వచ్చాడు. ఈ హడావుడిలో చిక్కంలో ఉన్న గాజు సీసా బిరడా లూజయింది. ద్రావకం అటు ఇటు చెదిరింది. పంచెకాలి కన్నాలు పడింది.

“ఇదేంటి నాన్నా పంచె నిండా కన్నాలు?” ఆశ్చర్యంగా ప్రశ్నించాడు కొడుకు.

“కన్నాలా...? ఎక్కడ? కొత్త పంచె...... ఏవి?” అటూ ఇటూ తిరిగి చూసుకున్నాడు. అవును కన్నాలే.

“ఏమిటి చెప్మా ఎలా పడ్డాయి కన్నాలు?”

చిక్కంలో ఉన్న గాజు బిరడా సీసా గుర్తుకొచ్చింది. సీసాను పైకి తీశాడు. మనసులో ఏదో ఆలోచన మెదిలింది. సీసాలో ఉన్న ద్రావకాన్ని జేబులో ఉన్న చేతిరుమాలుపై పోశాడు. కన్నం పడింది. అంటే ఈ ద్రావకానికి కాల్చే గుణం ఉందన్నమాట.

“నాన్నా అది ఏసిడ్ జాగ్రత్త. దూరంగా విసిరెయ్” అంటూ దూరంగా పడేశాడు కొడుకు.



## స్వాభిమానం

*“మనం జీవితంలో ఏం సంపాదించాం అన్నదానికంటే ఎంత పదిలంగా కాపాడుకోగలిగాం అన్నదానికే నేను విలువనిస్తాను. ఎందుకంటే సినిమా ఆఫర్ల కోసమో, సిరి సంపదలు సంపాదించుకోవడం కోసమో ఆత్మాభిమానాన్ని చంపుకోవలసిన అవసరం లేదు” అంటోంది రాజ్యలక్ష్మి.*

*(వృద్ధనారీ పతివ్రత అని వూరికే అన్నారా?)*

వెంటనే పొదల్లోకి జొరబడ్డారు.

అక్కడ పెద్ద పెద్ద కుండలు, మాగిన పళ్ల గుట్టలు, బెల్లం అచ్చులు, ద్రావకంతో నిండిన గాజుసీసా, ఇటుకలతో పేర్చిన పొయ్యి దూరంగా రెండు ప్లాస్టిక్ డబ్బాలు. విషయం అర్థమయింది సాంబయ్య కొడుక్కి. అక్కడ జరిగే తతంగమంతా పూస గుచ్చినట్లు వివరించాడు సాంబయ్యకు.

“ఓరినాయనో పొలం లీజుకిస్తే జరిగేదిదా, సర్కారు వారికి తెలిస్తే మనల్ని బొక్కలో తోసెయ్యరూ...” అంటూ బెంబేలు పడిపోయాడు సాంబయ్య.

“నువ్వేం కంగారుపడకు నాయనా. ఇక్కడ వస్తువులేమీ ముట్టద్దు. వెంటనే పోలీసులకు రిపోర్టు చేద్దాం పద”

దగ్గర్లోనే ఉన్న పోలీసు స్టేషనుకు పరుగెత్తారిద్దరూ. విషయమంతా వివరంగా చెప్పాడు పోలీసులకు సాంబయ్య. హుటాహుటిన పోలీసులు రంగప్రవేశం చేశారు. ఫోటోలు తీశారు. ఆ రాత్రికి ఓ కానిస్టేబులును కాపలా పెట్టారు.

రెండ్రోజులు గడిచేసరికల్లా పెద్ద పెద్ద అక్షరాలతో ప్రముఖంగా ప్రచురించబడిందావార్త. మద్యం తయారుచేసే రాకెట్‌ను పట్టుకోవడంలో సహకరించిన సాంబయ్య, కొడుకులను వేనోళ్ల పొగిడాయి పత్రికలు.

పోలీసు కమీషనర్ చెరో పదివేలు ప్రభుత్వం తరపున బహుమతి ప్రకటించారు.

సాంబయ్య ఉబ్బితబ్బిబ్బయ్యాడు, ఈ హఠాత్ పరిణామానికి, అనుకోని అదృష్టానికి. ప్రభుత్వం వారిచ్చిన ఇరవైవేలు అందుకున్నాడు సాంబయ్య.

ఆ బుజ్జి గాజు బిరడా సీసా పంచెకు కన్నాలు పొడిస్తే పొడిచిందిగాని తన దశే తిరిగేటట్లు చేసింది.

సర్కారు వారిచ్చిన బహుమతి మొత్తంతో పొలంలోని బ్రహ్మజెముడు డొంకలు పీకించి పారేశాడు. ఓ బోరు తవ్వుకున్నాడు. పుష్కలంగా నీరు. ఫలసాయం గుట్టలు గుట్టలు. ఆదాయం అంచనాలకు మించిపోయింది. పనులకోసం టవునుకు ఇంటికి తిరగటానికి కొడుక్కి ఓ మోపెడ్ కొనిపెట్టాడు సాంబయ్య.

తాను ఎంతో ముచ్చటపడి దాచుకున్న గాజుబిరడా సీసాను బాగా కడిగి ఆరపెట్టుకుని ముక్కు పొడిని దాన్నిండా పోసుకుని కళ్లకద్దుకుని చిక్కంలో భద్రపరచుకున్నాడు. ఎందుకైనా మంచిదని సీసాను పైకి తీసి గాజు బిరడాను గట్టిగా బిగించాడు.